క్లుప్తంగా

వండువలో కంటి వైద్య శిబిరం రేపు

వీరఘట్టం: వండువ షిర్డీసాయి ధ్యాన మందిరంలో ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ శాఖ, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

గరుగుబిల్లి: ఇళ్లు లేని నిరుపేదలంతా గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు పి.బాల ఓ ప్రకటనలో మంగళవారం కోరారు. అర్హులకు ప్రభుత్వం ఇళ్లస్థలాలు ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే నిధులను కూడా మంజూరు చేస్తుందన్నారు. ఆసక్తి ఉన్న అర్హులంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, గ్రామాల్లోని వీఆర్‌వోల ద్వారా దరఖాస్తు అందివ్వాలన్నారు.

వృద్ధులకు ఇళ్లవద్దకే రేషన్

● సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ



నర్సిపురంలో రేషన్ డిపోను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం రూరల్: దివ్యాంగులు, 65సంవత్సరాలు పైబడిన వారికి ఇంటివద్దనే రేషన్ అందించనున్నట్లు పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని నర్సిపురం గ్రామంలో గల రేషన్ డిపోలను తనిఖీ చేశారు. దివ్యాంగులు, 65ఏళ్ల పైబడిన వారు చౌకధరల దుకాణాల వద్దకు రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వారి ఇళ్లవద్దకే రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. నిత్యావసర సరుకుల నిల్వలు సరిపడా ఉంటాయని, ఎవరికీ అందవన్న అనుమానాలు వద్దన్నారు. ఈ మేరకు రేషన్ డిపో సిబ్బందితో కలిసి ఓ వృద్ధురాలి ఇంటికి వెళ్లి రేషన్ బియ్యాన్ని అందించారు. ఉదయం విధిగా 8గంటలకే సరఫరా ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బెలగాంలోని చౌకధరల దుకాణాలను సబ్‌కలెక్టర్ పరిశీలించారు.

కొట్లాటలో గాయాలు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో గ్రామదేవతల పండగ సందర్భంగా బంగారమ్మ తల్లి ఆలయ సమీపంలో ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం రాత్రి పౌరాణిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని చర్చివీధి, జగన్నాథపురం ప్రాంతాలకు చెందిన కొంతమంది యువకులు వీక్షించడానికి వెళ్లి అక్కడ చేసిన అల్లరిచేసి గొడవకు దారితీసింది. దీంతో చాకలి బెలగాం ప్రాంతానికి చెందిన డి.కృష్ణ అనే వ్యక్తిపై చర్చివీధి, జగన్నాథపురం వాసులు దాడిచేసి తలపై గాయం చేయడంతో స్థానికులు జిల్లా కేంద్రాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మళ్లీ చర్చివీధి, జగన్నాథపురం ప్రాంతానికి చెందిన యువకులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణపై అలాగే చాకలిబెలగాంకు చెందిన స్థానికులపై వైద్యుల ఎదురుగానే దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు ఆస్పత్రి అవుట్‌పోస్టింగ్ సిబ్బంది తెలిపారు. బాధితుల నుంచి ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించినట్లు ఆస్పత్ర అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపారు. పట్టణ పోలీసు స్టేషన్‌కు వివరాలు పంపనున్నట్లు పేర్కొన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

సీతానగరం: కరోనా వ్యాప్తి చెందుతుతున్న కారణంగా ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం వైద్యాధికారులు, సిబ్బందిపై ఉందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కేవీఎస్ పద్మావతి అన్నారు. ఈ మేరకు సీతానగరం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా వ్యాప్తి చెందుతోందని, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారు, గర్భిణుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అనంతరం అధికార సిబ్బంది హాజరు రికార్డులను, మందుల నిల్వలు, పీహెచ్‌సీకి వస్తున్న రోగుల సంఖ్య, మందుల నిల్వలను పరిశీలించారు. పీహెచ్‌సీలో జరుగుతున్న ఆశవర్కర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. అనంతరం శిథిలావస్థకు చేరిన భవనాల్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎస్వీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్లు భవాని, శర్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వేతనదారులు సమయపాలన పాటించాలి

సీతానగరం: మండలంలోని ఉపాధిహామీ పథకం వేతనదారులు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో చేసిన తీర్మానాల ఆధారంగా పనులు చేపట్టడంతో పాటు సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు జోగింపేటలోని ఎరుకు నాయుడు చెరువులో వేతనదారులు చేస్తున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించి మేట్‌లు ఆన్‌లైన్ ద్వారా వేస్తున్న మస్తరును తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనదా రులకు గిట్టుబాటు వేతనం, ప్రజలకు ఉపయోగ పడేవిధమైన పనులు జరగాలని సూచించారు. ఎండ తీవ్రంగా ఉన్నందున వేతనదారులు ఎండకు గురికాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా ఉదయాన్నే పనుల్లో పాల్గొనాలని సూచించారు.

వెన్నుపోటు దినంకు

తరలిరండి



విలేకరులతో మాట్లాడుతున్న విక్రాంత్, కళావతి

పాలకొండ:

ఎన్నికల ముందు అమలు చేయలేని లెక్కకు మించి హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మాట తప్పిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రంలో బుధవారం చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి రావాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పిలుపునిచ్చారు. పాలకొండలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మోసపు హామీలతో అధికారం చేపట్టి ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన జూన్ 4న వెన్నుపోటు దినంగా ప్రజలు పరిగణించాలన్నారు. బుధవారం పాలకొండ నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. హామీలు అమలు కోసం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నట్టు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజలు ఉదయం 10 గంటలకు వైఎస్సార్ కూడలికి చేరుకోవాలని, అక్కడ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తరలిరండి..

గరుగుబిల్లి: వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు మండలంలోని ఖడ్గవలస జంక్షన్ వద్ద బుధవారం ప్రారంభమయ్యే వెన్నుపోటు దినం కార్యక్రమానికి తరలిరావాలని పార్టీ మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు ఓ ప్రకటనలో మంగళవారం పిలుపునిచ్చారు. ఎన్నికల హామీలు అమ లు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం మోసగిస్తుండడాన్ని వెన్నుపోటుగా భావిస్తూ ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆధ్వర్యంలో కురుపాం జరిగే కార్యక్రమానికి ఖడ్గవలస జంక్షన్ నుంచి ర్యాలీగా వెళ్లడం జరుగుతుందన్నారు. పార్టీ శ్రేణులంతా కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

కొమరాడ: కురుపాం నియోజకవర్గ కేంద్రంలో బుధవారం జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమానికి తరలిరావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధనరావు ఓ ప్రకటనలో మంగళవారం కోరారు. అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బయలుదేరి కార్యక్రమ విజయవంతానికి తోడ్పడాలన్నారు.

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కురుపాం నియోజకవర్గ కేంద్రంలో బుధవారం జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లె సుజాత, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నిషార్, అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావులు కోరారు. ఇదే విషయమై వారు కురుపాంలో కార్యక్రమ వాల్‌పోస్టర్లు బుధవారం ఆవిష్కరించారు. మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. అందరూ తరలివచ్చిన తర్వాత పెట్రోలు బంకు నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ తీయడం జరుగుతుందన్నారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు.

‘భోజనం’పై శిక్షణ



పోర్టిఫైడ్ వంటలపై వివరిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి సుబ్రహ్మణ్యం

భామిని: స్థానిక కేజీబీవీలో ఎంఈవోలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. టాటా ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విజయవాహినీ చారిటబుల్ ఫౌండేషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి కె.సుబ్రహ్మణ్యం, ప్రోగ్రాం అసోసియేట్ కె.సాయిలక్ష్మి వంట ఏజెన్సీలకు శిక్షణ ఇచ్చారు. భోజనం తయారీలో పోర్టిఫైడ్ పదార్థాలు విధిగా ఉపయోగించాలన్నారు. అనంతరం వంట ఏజెన్సీలకు గ్రూపుల వారీగా వంటల పోటీలు నిర్వహించారు. సీఆర్‌ఎంటీలు ఎస్.చిన్నబాబు, పి.కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

● లాలిస్తూ.. పోడు పనులు



ఏజెన్సీలో గిరిజన మహిళలు తమ చంటి బిడ్డలతో పోడు వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. పనుల వద్ద ఉన్న ఏ చెట్టు కొమ్మకో... ఊయలలు కట్టి తమ చంటి బిడ్డలను అందులో నిద్ర పుచ్చుతారు. తరువాత పనులు చేసుకుంటూరు. మధ్యలో బిడ్డ లేస్తే ఓ వైపు లాలిస్తూ... మరోవైపు పాలిస్తూ... మళ్లీ నిద్రపుచ్చి తమ వ్యవసాయ పోడు పనుల్లో నిమగ్నమవుతారు. సీతంపేట మండలం మండ గ్రామానికి చెందిన సవర తవిటమ్మ మంగళవారం ఇలా తన పోడు వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన చోట తన బిడ్డను ఇలా చెట్టుకు ఊయల కట్టి నిద్ర పుచ్చడం సాక్షి కెమెరాకు చిక్కింది.

– సీతంపేట


పాఠశాల బాగుకు తన వంతు సాయంగా...



సున్నాలు వేస్తున్న యువకుడు

సీతంపేట: ఎవరో వచ్చి తమ గ్రామంలోని పాఠశాలను బాగు చేస్తారని ఎదురు చూడకుండా తన సొంత డబ్బులతో రంగులు వేసి తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నాడు ఓ యువకుడు. చాకలిగూడ గ్రామంలో ఉన్న గిరిజన ప్రాథమిక పాఠశాల మరమ్మతులకు గురైంది. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండాలని, గ్రామంలోని సవర తిరుమలరావు అనే యువకుడు ముందుకు వచ్చి రూ.10 వేలు వెచ్చించి పాఠశాలకు రంగులు వేసి పైన మెరుగులు దిద్దాడు. అయితే తరగతి గది లోపల మాత్రం బాగు చేయడానికి ఎక్కువే ఖర్చు అవుతుందని దాతలు సాయం చేస్తే తాను పాఠశాలను బాగు చేసుకుంటానని చెబుతున్నారు. గచ్చు పెచ్చులూడిపోయిందని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పరంగానైనా, దాతలైన సాయం చేయాలని కోరుతున్నారు.

పశువైద్య సేవలు అందక అవస్థలు



పశువైద్యాధికారి లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

గరుగుబిల్లి: పశువైద్య సేవలు అందక మండలంలోని పాడిరైతులు అవస్థలు పడుతున్నారు. స్థానిక పశువైద్య శాలలో పశువైద్యులెవరూ లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఏడు నెలలుగా ఖాళీగా ఉన్న పశువైద్యాధికారి పోస్టులో ఏ ఒక్కరినీ నియమించలేదు. దీంతో సకాలంలో తమ పశువులకు అవసరమైన వైద్యం చేయించుకోలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాలలకు ఒక్క పశువైద్యాధికారి మాత్రమే ఉండేవారని, ఇప్పుడు ఆ ఒక్కరు కూడా లేరన్నారు. దీంతో ఉల్లిబద్రలోని పశువైద్యాధికారి ఏదో అలా వచ్చి అరకొర సేవలతో మమ అనిపించేస్తున్నారని పాడిరైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారిని నియమించాలని కోరుతున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ‘కొండవాడ’



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సర్పంచ్ కృష్ణారావు తదితరులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఒప్పంగి గ్రామంలో గత 30 రోజులుగా నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నీ మంగళవారంతో ముగిసింది. ఆఖరి రోజు జరిగిన ఫైనల్ పోరులో గొడుగూడ జట్టుపై కొండవాడ జట్టు గెలిచి, ట్రోఫీ కైవసం చేసుకుంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కొండవాడ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 91 పరుగులు చేసింది. అనంతరం 92 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన గొడుగూడ జట్టు 43 పరుగులు చేసి ఆలౌట్ అయింది. విజేత జట్టుకు ట్రోఫీ సహా రూ.20 వేల నగదును సర్పంచ్ ఎం.కృష్ణారావు చేతులమీదుగా అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన గొడుగూడ జట్టుకు రూ.10 వేల నగదు అందజేశారు. ఈ టోర్నీలో మొత్తం 82 జట్లు పాల్గొన్నాయి.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో కొత్తగా నిర్మించిన రథాలమ్మ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం జరిగింది. ఉదయం విఘ్నేశ్వరపూజ, సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం కొత్త ఆలయానికి తోడ్కొని వచ్చి, ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

వేతనాలు పెంచాలి

గరుగుబిల్లి: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఇచ్చే వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ డిమాండ్ చేశారు. మండలంలోని ఉల్లిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం నిర్వాహకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వం తమపై పనిభారం పెంచిందని, ఇప్పుడిస్తున్న రూ.3 వేల పారితోషికాన్ని రూ.10 వేలకు పెంచాలని వంట నిర్వాహకులు కోరారు. అలాగే విద్యార్థులకు సరిపడ రేషన్ పంపిణీ చేయాలన్నారు. అనంతరం ఇవే డిమాండ్లతో ఎంఈవో కె.కొండలరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం నిర్వాహకుల సంఘం నాయకులు పావని, రోహిణి, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

వీరఘట్టం: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన యంత్ర పరికరాలను ఆయన మంగళవారం అందజేశారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖరీఫ్‌లో కావాల్సిన వరి విత్తనాల కోసం రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో జక్కువ సౌజన్య, ఏడీఏ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

గరుగుబిల్లి: ఖరీఫ్ సాగుకు విత్తనాలు అవసరమైన రైతులంతా పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో ఆర్.విజయభారతి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఎంటీయూ 1064, బీపీటీ 5204, ఎంటీయూ 7029 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన వారు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకుని రైతు సేవా కేంద్రాలు, సచివాలయాలకు వెళ్లాలన్నారు.

80 లీటర్ల సారా స్వాధీనం



సారా స్వాధీనం చేసుకున్న సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి గ్రామవాసి వెలమల బాబి అనే వ్యక్తి నుంచి 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. బైక్‌పై సారా తరలిస్తుండగా పట్టుకున్నామని, నిందితుడిని అరెస్ట్ చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

వినతిపత్రం అందజేత



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, గిరిజనులు

జియ్యమ్మవలస: గిరిజనుల సాగు భూములకు డి–పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకుడు గంగునాయుడు, కె.సీతారాం డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద గిరిజన రైతులతో కలిసి మంగళవారం ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అలమండ గ్రామ రెవెన్యూ పరిధిలో 177 సర్వే నంబరులో 4 దశాబ్దాలుగా గిరిజనులు వ్యవసాయం చేస్తున్నారని, అయినా వారికి పట్టాలు ఇచ్చే నాథుడే లేరన్నారు. పట్టాలు లేకపోవడంతో వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. తుంబలి, చంద్రశేఖరరాజపురం, రావాడ, లక్ష్మీపేట, బల్లేరు, కిడిగేషు గ్రామాల్లోని గిరిజన రైతులందరికీ పట్టాలు ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బి.మోహనరావు, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు జి.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పుస్తకాలు తరలింపు



పాఠశాలకు ఆటోలో తరలిస్తున్న పుస్తకాలు

జియ్యమ్మవలస రూరల్:

మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ నుంచి ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు తరలిస్తున్నారు. జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభోత్సవం నేపథ్యంలో ఆరోజు నాటికే విద్యార్థులకు పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈవో ముదిలి శ్రీనివాసరావు తెలిపారు.

రెండు రోజులుగా మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. మొత్తం మండల వ్యాప్తంగా 12 జిల్లా పరిషత్ పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత, 81 ప్రాథమిక పాఠశాలలకు పుస్తకాలు అందివ్వడం జరుగుతుందన్నారు.

వైద్యులతో సేవలందించండి



ఆందోళన వ్యక్తం చేస్తున్న గుమ్మలక్ష్మీపురం ప్రజలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులతో వైద్యసేవలు అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఆస్పత్రిలో అసలు వైద్యుల ఆచూకీ కనిపించడం లేదని, దీంతో రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదన్నారు. గత కొన్నిరోజులుగా ఈ పరిస్థితి నెలకొందని, ఎంతటి రోగంతో ఆస్పత్రికి వెళ్లినా కింది స్థాయి సిబ్బందే వైద్యం చేస్తున్నారని, వైద్యుల జాడ కరువైందన్నారు. చాలామంది కురుపాం ఆస్పత్రికి వెళ్లిపోవాలని సలహా ఇస్తున్నారని, వైద్యులు లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా వైద్యులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని లేకుంటే కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు.

కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌలురైతులు

బలిజిపేట: గ్రామసభలు పెట్టి కౌలు రైతులను గుర్తించి భూయజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రమణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో బలిజిపేటలో తహసీల్దార్ రత్నకుమారికి వినతి పత్రం మంగళవారం అందించారు. బలిజిపేట మండలంలో సుమారు 2వేల మంది కౌలు రైతులు ఉన్నారన్నారు. గ్రామసభలు పెట్టి సభలద్వారా కౌలు రైతులను గుర్తించి వారికి అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాస్తవ సాగుదారుల పేరుతోనే ఈక్రాప్ నమోదు చేయాలని, కూటమి ప్రభుత్వం 2011చట్టాన్ని అమలు చేసి కౌలు రైతులకు న్యాయం చేస్తామని చెప్పిన విధంగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



ఈదురుగాలులతో కూడిన వర్షం

మండలంలోని కందివలస, గుణానపురం గ్రామాలు సహా మరికొన్ని గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలుల ధాటికి పాతగుణానపురంలో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరగ్గా, మరికొన్నిచోట్ల అరటి, ఇతర పంటలు నేలమట్టమయ్యాయి. అయితే ఇన్నాళ్లు వేసవి ఎండలకు ఉక్కపోతతో అలమటించిన ప్రజలకు వర్షం కారణంగా ఏర్పడిన చల్లని వాతావరణం ఉపశమనాన్నిచ్చింది.

కొమరాడ: